భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

రెండవ శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. లక్ష్మీ పూజకోసం ప్రత్యేక పిండివంటలు తయారు చేశారు. అనంతరం వరలక్ష్మీ దేవిని ప్రతిష్ఠించారు. పూజ చేసి, మంగళహారతి పాడి ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. రుద్రేశ్వరస్వామి వారిని అలంపూర్ జోగులాంబ అమ్మవారిగా అలంకరించారు. వరంగల్ హంటర్ రోడ్డులోని సంతోషిమాత దర్శనం కోసం భక్తులు భారీగా బారులుతీరారు. కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూల గణపతి దేవాలయ ఆవరణలోని మహాలక్ష్మి అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో అన్నదానం చేశారు. మడికొండలోని మహంకాళి ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో పండితులు ప్రత్యేక అభిషేకం చేశారు.

- సాక్షి నెట్‌వర్క్


వరంగల్ హంటర్‌రోడ్డులోని సంతోషిమాత ఆలయంలో భక్తుల రద్దీ


కాజీపేట శ్వేతార్క ఆలయంలో సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు


హసన్‌పర్తి: పెద్దమ్మ తల్లి ఆలయంలో అన్నదానం


జోగులాంబ అలంకరణలో రుద్రేశ్వరుడు


మడికొండ: మహంకాళి ఆలయంలో పూజలు

క్లుప్తంగా

కలెక్టర్, కమిషనర్‌కు సన్మానం



హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు వేర్వేరుగా శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం, భద్రకాళి అమ్మవారి చిత్రపటాలను అందించి సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, సహ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికేల రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్ రవీందర్‌కు..



కాజీపేట: కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్‌ను పట్టణ గౌడ సంఘం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల డిప్యూటీ కమిషనర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన రవీందర్‌ను మోడెం సమ్మయ్య ఆధ్వర్యంలో పలువురు అభినందించారు. కార్యక్రమంలో రాజేందర్, బుర్ర శ్రీనివాస్, సుదర్శన్, అనిల్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి కృషి

హన్మకొండ అర్బన్: అధికారులతో ఎప్పటికప్పుడు చర్చలు జరిపి మంత్రి కేటీఆర్ సహకారంతో ఎప్పటికప్పుడు నగరాభివృద్ధికి కావాల్సిన నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. నగరంలోని 60వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, డివిజన్ అధ్యక్షుడు రామరాజు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డీఐఈఓపై చర్య తీసుకోవాలి

విద్యారణ్యపురి: అనుమతిలేని ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై చర్య తీసుకోవాలని పలుమార్లు హనుమకొండ జిల్లా డీఐఈఓ గోపాల్‌కు వినతిపత్రాలు అందజేసినా ఆయా కళాశాలలపై ఆయన చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో డీఐఈఓపై ప్రభుత్వం వెంటనే చర్య తీసుకోవాలని పేర్కొన్నారు. కొన్ని ప్రైవేట్ కళాశాలలకు ఒకచోట అనుమతి తీసుకుని ఆయా యాజమాన్యాలు మరో ప్రాంతంలో నిర్వహిస్తున్నాయని తెలిపారు. షిఫ్టింగ్ అనుమతి లేకుండానే నిర్వహిస్తున్నా ఉన్నతాధికారి పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అకాడమీల పేరుతో, హాస్టళ్ల పేరుతో కూడా పలు కళాశాలలు నడుస్తున్నాయని వివరించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ నయీంనగర్ ప్రాంతానికి చెందిన తెలంగాణ ఉద్యమకారిణి రహీమున్నీసా కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ జిల్లా చైర్మన్ మీర్జా అజీజుల్లా బేగ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో 153 కేసులున్న రహీమున్నీసాను అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ విస్మరించిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. రహీమున్నీసాతో పాటు నజీమాబేగం, నిజామొద్దీన్, సాబీర్, సమీర్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ ఆయూబ్, అబ్దుల్‌బాఖీ, ఇబ్రహీం, అజహర్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలు తొలగించడం హేయం



వరంగల్: ఇళ్లులేని నిరుపేదలు వేసుకున్న గుడిసెలను కూల్చేయడం అమానుషం, హేయమైన చర్య అని, ప్రతిఒక్కరూ ఈ చర్యని ఖండించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జగదీష్ కోరారు. 20వ డివిజన్‌లోని ఏనుమాముల మార్కెట్‌రోడ్డు పద్మానగర్ కాలనీ వెనకాల చిన్నవడ్డేపల్లి చెరువులో సీపీఎం ఆధ్వర్యంలో వేసిన గుడిసెలను అధికారులు కూల్చివేశారు. ఆ ప్రాంతాన్ని జిల్లా కమిటీ సభ్యులతో కలిసి జగదీష్ శుక్రవారం పరిశీలించి గుడిసెవాసులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాబు, యాదగిరి, బషీర్, సురేష్, సుమన్, కల్పన, రమేష్, రజిత, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లేశ్వర్, తదితరులు


ఆర్ట్స్ కళాశాలలో నివాళులర్పిస్తున్న బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు, విద్యార్థులు


హన్మకొండ: బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యుత్ బీసీ ఉద్యోగులు


కాజీపేట జంక్షన్‌లో మాట్లాడుతున్న రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్

మండల్ కమిషన్ రిపోర్ట్ ద్వారా దేశంలో సామాజిక న్యాయానికి పునాదులు వేసిన మహనేత బిందేశ్వర్ ప్రసాద్ మండల్ (బీపీ మండల్) అని పలువురు కొనియాడారు. దేశంలో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు వచ్చాయంటే అది ఆయన సిఫార్సు మేరకేనని అన్నారు. మండల్ చేసిన 40 సిఫార్సుల్లో ఒక రిజర్వేషన్ తప్ప మిగితావి అమలు కావడం లేదని వాపోయారు. జయంతి సందర్భంగా బీపీ మండల్ చిత్రపటాల వద్ద శుక్రవారం నివాళులర్పించారు.

- సాక్షి నెట్‌వర్క్

డిజిటల్ యుగంలోనూ లైబ్రరీ అవసరమే


మౌనికకు బహుమతి అందజేస్తున్న వీసీ, తదితరులు

కేయూ క్యాంపస్: డిజిటల్ యుగంలోనూ లైబ్రరీలు కూడా ఎంతో అవసరం అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. క్యాంపస్‌లో లైబ్రరీ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన లైబ్రరీ సైన్స్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో వీసీ మాట్లాడారు. ఎంఎల్ఐఎస్సీ కోర్సులో గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థి టీ.మౌనికకు వెంపాటి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ తరఫున విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ కోలాహలం రామ్‌కిషోర్ రూ.10వేల నగదు బహుమతిని వీసీ రమేష్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే, ఇటీవల మద్రాస్ లైబ్రరీ అసోసియేషన్ నుంచి ఉత్తమ అధ్యాపకురాలిగా అవార్డు అందుకున్న లైబ్రరీ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణిని వీసీ అభినందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కృష్ణమాచార్యులు, డాక్టర్ అంజయ్య, డాక్టర్ జయరాంరెడ్డి పాల్గొన్నారు.

రిజర్వేషన్ సాధనకు మెపా రాష్ట్ర స్థాయి నిరాహార దీక్ష

హన్మకొండ: ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న దీక్ష చేపట్టనున్నట్లు ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్ తెలిపారు. హనుమకొండలో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ముదిరాజ్‌లను పలు డిమాండ్లతో బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద రాష్ట్ర స్థాయి నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్, నాయకులు గుండ్ర చంద్రశేఖర్, పెండెం మధుసూధన్, అల్లం వేణుమాధవ్, నీరటి రాజు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ అగర్వాల్

వరంగల్: రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే ఎలాంటి ప్రయోజనాలు సమకూరుతాయో ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని వరంగల్ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్, యూపీ బరేలి ఎమ్మెల్యే సంజయ్ అగర్వాల్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ నాయకుడు బైరి శ్యాంసుందర్ ఆధ్వర్యంలో 12, 13, 22, 23వ డివిజన్ల సమావేశం ఎల్‌బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అగర్వాల్ మాట్లాడుతూ తెలంగాణలో గెలవడానికి సానుకుల వాతావరణం ఉందని సంజయ్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, గంట రవి, వన్నాల వెంకటరమణ, తూర్పు నియోజకవర్గ కన్వీనర్ పాట్టి శ్రీనివాస్ గుప్తా, అల్లం నాగరాజు, పిట్టల కిరణ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నియామకం

వరంగల్ అర్బన్: మెప్మా టౌన్ ప్రాజెక్ట్ అధికారి(టీపీఆర్ఓ)గా కోలా రాజేశ్‌కుమార్‌గౌడ్, బల్దియా ఉద్యాన వన విభాగం అధికారిగా రమేశ్ నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం మేయర్ గుండు సుధారాణిని వీరిద్దరు కలిసి పూల మొక్కలు అందించారు. రాజేశ్‌కుమార్ మెడికల్ అండ్ హెల్త్ విభాగం నుంచి డిప్యూటేషన్‌పై వచ్చారు. నర్సంపేట ఫారెస్ట్ రేంజ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న రమేశ్ బల్దియా హెచ్ఓగా విధుల్లో చేరారు.

నేడు మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్ రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో శనివారం మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు సైన్స్ సెంటర్ అధికారి రాకేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఎంబీ బెంగళూరులోని విశ్వేశ్వరయ్య సైన్స్ మ్యూజియం సౌజన్యంతో డీఎన్ఏపై పూర్తి అవగాహన కల్పించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ తోడ్ప డుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

హన్మకొండ అర్బన్: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా విస్మరించిందని ఏఐసీటీయూ హనుమకొండ జిల్లా కన్వీనర్ మొగిలి శ్రీనివాసరావు విమర్శించారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎన్నికల హామీలు, ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న జాప్యంపై నాయబ్ తహసీల్దార్ అనీఫ్‌పాషాకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలు, అందుబాటు లేని ఉపాధి పనులతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో మట్టెడ మొగిలి, జూలూరి ఇందు, గన్నోజు మనిమాల, రాధిక, లావణ్య, కోమల, శ్వేత, సరోజన, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు జర్నలిస్టులు సంఘటితం కావాలి



హన్మకొండ: సమస్యల పరిష్కారంతో పాటు లక్ష్యాల సాధనకు జర్నలిస్టులంతా సంఘటితంగా ఉండాలని హనుమకొండ జర్నలిస్టుల పొదుపు, పరపతి సహాయ సహకార సంఘం అధ్యక్షుడు అలువాల సదాశివుడు అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని నిత్య బాంక్వెట్ హాల్‌లో సంఘం సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ సంఘంలోని జర్నలిస్టుల అందరికి నివేశన స్థలాలు ఇప్పించేందుకు కార్యవర్గం కృషి చేయాలని కోరారు. హనుమకొండ జర్నలిస్టుల సహకార సంఘానికి సొంత భవనం నిర్మాణానికి కృషి చేయాలన్నారు. బకాయిలు ఉన్న సభ్యులు సెప్టెంబర్ 10వ తేదీలోగా పూర్తిగా చెల్లించాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం, ఇటీవల ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో గెలుపొందిన సంఘంలోని సభ్యులను సన్మానించారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి నాయకపు సుభాష్, నాయకులు సాయిప్రదీప్, కంకణాల సంతోష్, కృష్ణకుమార్, సత్యం, గోకారపు శ్యాం, వలిశెట్టి సుధాకర్, బుచ్చిరెడ్డి, సాయిరాం, సదయ్య, అమర్, సుధాకర్, అంజీ, వెంకన్న, మురళి తదితరులు పాల్గొన్నారు.

రేపు గురుధామంలో భగవద్గీత శ్లోక పఠన పోటీలు

వరంగల్: ములుగురోడ్డు సమీపంలోని సప్త గురుధామంలో 27వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు భగవద్గీత శ్లోక పఠనంపై పోటీలు నిర్వహించనున్నట్లు శివానంద గురుకల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ తెలిపారు. గురుధామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో భగవద్గీత శ్లోక పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12ఏళ్లలోపు పిల్లలకు, 13నుంచి 30ఏళ్ల లోపు వారికి వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. విజేతలైన వారికి మొదటి బహుమతి రూ.3,116లు, రెండవ బహుమతి రూ.2,116లు, మూడవ బహుమతి రూ.1,116లు అందిస్తామని తెలిపారు. సమావేశంలో ట్రస్టీలు బండారు సాయి నారాయణ, మాదారపు సదాశివుడు, గందె ఉమాశంకర్, రేపాల రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూమి సర్వేపై అభ్యంతరం

వరంగల్ చౌరస్తా: వరంగల్ గోవిందరాజుల గుట్ట దేవాలయ భూమిలో ఆక్రమణల సర్వేపై అభ్యంతరం వ్యక్తమైంది. దేవాదాయ శాఖ అధికారులు, ల్యాండ్ సర్వే, రెవెన్యూ అధికారులు శుక్రవారం సర్వే చేస్తుండగా హైకోర్టుకు చెందిన ఓ న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్వే నంబరు 15/1లో సైకిల్ స్టాండ్ స్థలాన్ని దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోవడం సరికాదని, సర్వేలో అనేక లోపాలున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రావు, అసిస్టెంట్ కమిషనర్ సునీత, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రత్నాకర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్


నవీన్


రాధిక

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరి పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. విద్యా కళాశాలలో పరిశోధకుడు గంగసాని నవీన్‌కు వర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది, ఎడ్యుకేషనల్ ఇన్షియేటివ్ క్యారీడ్ అవుట్ బైది ఐటీడీ భద్రాచలం – ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి నవీన్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. కేయూ విద్యా కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ ఘంటా రమేష్ పర్యవేక్షణలో నవీన్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు రాధికా కొప్పులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. రోల్ ఆఫ్ బ్యాంక్స్ ఇన్ ఫైనాన్సియల్ ఇన్‌క్లూషన్ – ఏ స్టడీ ఆఫ్ ఏపీజీవీబీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రాధికకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు మల్లారెడ్డి తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఇంద్రసేనారెడ్డి పర్యవేక్షణలో రాధిక తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కాజీపేట: గత మునుగోడు ఎన్నికకు ముందు గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలయ్యేలా ప్రత్యేక జీఓ జారీ చేయాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు కాజీపేట మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్మికుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పింఛన్లను మంజూరు చేయాలని కోరారు.

గ్యార్మీ జెండా గద్దె నిర్మాణ పనులు ప్రారంభం

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ లేబర్‌కాలనీలోని టీఆర్‌టీకాలనీలో మసీదు సమీపంలో గ్యార్మీ జెండా గద్దె నిర్మాణ పనులను కార్పొరేటర్ వస్కుల బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, డివిజన్ అధ్యక్షుడు రాజేష్, మైనార్టీ డివిజన్ అధ్యక్షుడు రియాజుద్దీన్, యాసిన్, ఖయ్యూం, యాకుబ్, యూనిస్, విసార్, మనోహర్, జగదీష్ పాల్గొన్నారు.

తీవ్రంగా గాయపడిన నాయకుడికి పరామర్శ

కాజీపేట: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ క్యాంపు కార్యాలయం ముట్టడిలో తీవ్రంగా గాయపడిన పార్టీ నాయకుడు మేకల శ్రావణ్ కుమార్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ శుక్రవారం పరామర్శించారు. కాజీపేట మండలం సోమిడి గ్రామంలో విశ్రాంతి తీసుకుంటున్న శ్రావణ్ ఇంటికి కార్యకర్తలతో కలిసి వెళ్లి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుంటి కుమారస్వామి, చిర్ర నర్సింగ్‌గౌడ్, కాయిత రాజ్‌కుమార్, సత్యనారాయణ, సుంచు వేణు, ప్రశాంత్, మేకల కేదారి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తీజ్ ఉత్సవ కమిటీ ఎన్నిక

హసన్‌పర్తి: గుండ్లసింగారంలో తీజ్ ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా స్థానిక కార్పొరేటర్ రవినాయక్, గౌరవ అధ్యక్షుడిగా పర్వతగిరి జెడ్పీటీసీ సభ్యుడు బానోతు సింగులాల్, ముఖ్య సలహాదారులుగా పోరిక ఈశ్వర్‌సింగ్, ముడవత్ రామచంద్ర నాయక్, ఉపాధ్యక్షులుగా గుగులోతు హనుమంతు, మాలోతు రాజు, ప్రధాన కార్యదర్శిగా లావుడ్య రాజునాయక్, కార్యదర్శులుగా అజ్మీర వెంకటేష్, శ్రీను, ప్రమోద్, సంయుక్త కార్యదర్శులుగా ఈశ్వర్, మురళి, రాజేందర్, కోశాధికారిగా మోహన్‌నాయక్‌ను ఎన్నుకున్నారు.

రేపు ఉచిత మెడికల్ క్యాంప్

హన్మకొండ అర్బన్: నగరంలోని 49వ డివిజన్ ప్రకాశ్‌రెడ్డిపేటలో పునీత, వికాస పొదుపు పరస్పర సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మెడికేర్ ఆస్పత్రి సహకారంతో ఈనెల 27న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ ఏనుగుల మానస తెలిపారు. గుండె, గైనకాలజీ, ఆర్థో, చర్మ, డెంటల్, షుగర్, బీపీ, కంటి, ఛాతీ, న్యూరాలజీ పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఎమ్మెల్యే నరేందర్‌కు సన్మానం

ఖిలా వరంగల్: రెండవ సారి తూర్పు ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా వరంగల్ ఫోర్ట్‌రోడ్డు పెరకవాడలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను ప్రైవేట్ విద్యా సంస్థలు, టస్మా, వడుప్సా ప్రతినిధులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో అచ్చ వినోద్‌కుమార్, కొమ్మిని భూపాల్‌రావు, చల్ల నాగార్జున్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, వంగల రాధాకృష్ణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం


మృతదేహం

ఖిలా వరంగల్: వరంగల్ – నర్సంపేట రోడ్డులోని దయానంద్‌కాలనీలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు మిల్స్‌కాలనీ ఎస్సై పున్నం చందర్ తెలిపారు. ఆమె మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. వివరాలకు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఎఫ్‌సీఐలో రక్తదాన శిబిరం

కాజీపేట: కాజీపేట భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)లో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డివిజనల్ మేనేజర్ సుమిత్ చక్రవర్తి ప్రారంభించారు. రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో 38మంది సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో శశికుమార్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ధీరజ్, జగదీష్, వెంకటస్వామి, కార్తీక్, హరి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు


అర్జుల కిషన్‌రెడ్డి, అధ్యక్షుడు


ఊకంటి వనంరెడ్డి, ప్రధాన కార్యదర్శి

హన్మకొండ అర్బన్: రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ హనుమకొండ జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా అర్జుల కిషన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఊకంటి వనంరెడ్డి రాష్ట్ర కమిటీ ప్రకటించింది. అనంతరం వారు జిల్లా కమిటీ మిగతా ప్రతినిధులను శుక్రవారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ఎం.రాజశేఖర్, రాజారపు సంజీవరెడ్డి, టీ.శ్రీనివాస్‌రెడ్డి, పీ.దివాకర్‌రెడ్డి, బొల్లు రాజిరెడ్డి, జన్నపురెడ్డి రాజిరెడ్డి, బండ రత్నాకర్‌రెడ్డి, నోముల వెంకట్‌రెడ్డి, చాడ తిరుపతిరెడ్డి, మడుగుల ధర్మారెడ్డి, ప్రచార కార్యదర్శులుగా జాలి ప్రమోద్‌రెడ్డి, పాడి మల్లారెడ్డి, వెన్నం సంతోష్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా బేతి భూపాల్‌రెడ్డి, వీసం కర్ణాకర్‌రెడ్డి, చల్లా రాంరెడ్డి, మల్లాడి రాజిరెడ్డి, వేపటి రమేష్‌రెడ్డి, ఇర్ర తిరుపతి రెడ్డి, మెరుగు రాజిరెడ్డి, సలహాదారులుగా చందుపట్ల రాజిరెడ్డి, లెక్కల జలంధర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మరో 10 మందిని నియమించారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చేవరకూ వెనక్కితగ్గం


ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

రామన్నపేట: అర్హులైన ప్రతీఒక్కరికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చేవరకూ వెనక్కి తగ్గేది లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్‌బాబు అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు ఎంజీఎం జంక్షన్‌లోని వరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్‌బాబు మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలని సవాల్ విసిరారు. నియోజకవర్గంలోని ప్రజలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామంటున్న ఎమ్మెల్యే మోసం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యవర్గ సభ్యుడు రత్నం సతీష్‌షా, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్, నాయకులు వన్నాల వెంకటరమణ, గంటా రవికుమార్, అల్లం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే ఆరోపణలు


చెరువును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హసన్‌పర్తి: ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే కాంగ్రెస్ పార్టీ అసత్య ఆరోపణలు చేస్తోందని కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే రమేష్ ప్రమేయంతోనే గోపాలపురం చెరువు కబ్జాకు గురైందన్న కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ ఆరోపించడాన్ని సునీల్ ఖండించారు. ఈమేరకు చెరువును బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే చెరువు కబ్జాకు గురైందని అన్నారు. చెరువు కబ్జాపై ఈనెల 26న చర్చపై జడ్సన్ విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మణీందర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి లోకిని చందర్, నాయకులు రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లంతా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓటేయండి

నయీంనగర్: ముదిరాజ్‌లంతా ఐకమత్యంగా ఉండి బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసేవిధంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు చూడాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావుల జగదీశ్వర్ ప్రసాద్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రాంత కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2014, ఆగస్టులో నిర్వహించిన కుటుంబ సర్వే లెక్కల ప్రకారం రాష్ట్రంలో 64 శాతం బీసీ జనాభా ఉందని, అందులో 14శాతం (55లక్షల మంది) ముదిరాజ్ జనాభా ఉందని వివరించారు. రాయిశెట్టి రాజమల్లయ్య, పల్లెబోయిన రాజేందర్, గుండా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

దామెర: మూగజీవుల ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి వెంకటనారాయణ సూచించారు. మండలంలోని పులుకుర్తిలో పశు సంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ, వికాస తరంగిణి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 56 పశువులకు గర్భకోశ వ్యాధులు, 90 పశువులకు గాలికుంటు, 85 పశువులకు నట్టల నివారణ, ముద్దచర్మ వ్యాధులపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

మార్కెట్‌లోకి న్యూ గ్లామర్ ద్విచక్ర వాహనం విడుదల


వాహనాన్ని ఆవిష్కరిస్తున్న వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్


నక్కలగుట్టలో ఎంవీఐ కంచి వేణు..

రామన్నపేట: ములుగు రోడ్డులోని శ్రీశ్రీశ్రీ ఆటోమొబైల్స్‌లో హీరో మోటోకార్ప్ ఆధ్వర్యంలో పాత స్టైలిష్‌తో కొత్త గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని మార్కెట్‌లోకి వాహనాన్ని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కోల రవీందర్ శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ హీరో షోరూం సీఈఓ రమేష్‌మూర్తి, మేనేజర్ రఘువీర్, టెక్నీషియన్ పాల్గొన్నారు.

హన్మకొండ: హనుకొండ నక్కలగుట్టలోని శ్రీ వైష్ణవి షోరూమ్‌లో గ్లామర్ 125సీసీ ద్విచక్ర వాహనాన్ని మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కంచి వేణు విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రీ వైష్ణవి షోరూమ్ అధినేత చందుపట్ల సత్యపాల్ రెడ్డి, రిటైర్డ్ ఆర్‌టీఏ పున్నం ఇంద్రసేనా రెడ్డి, మేనేజర్ మధు, శ్రీకాంత్ రెడ్డి, జబ్బార్, సందీప్ రెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టిన ప్రభుత్వం


మాట్లాడుతున్న పుట్ట లక్ష్మణ్

ఖిలా వరంగల్: ప్రభుత్వ విద్యారంగాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి అధ్యక్షతన జిల్లా సమితి జనరల్ బాడీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ కోట్లాడి తెచ్చుకున్న స్వరాష్ట్రంలో విద్యారంగ సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ విద్యారంగంపై సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించలేదని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కరువయ్యాయని వాపోయారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పనాన ప్రసాద్, సాగర్, హరీశ్, రాకేష్, సంతోష్, శివకుమార్, ప్రశాంత్, రాంచందర్, స్టాలిన్ పాల్గొన్నారు.